

# సోమరి స్వగతాలు

## బడి పంతుళ్ళు

'బతకలేక బడిపంతులు' అని సామెత. మా బంధువు ఒకాయన ఉండే వాడు. పాలగుమ్మారి వెర్రాడని ఆయన పొడుప నామం. యాభై ఏళ్ళొచ్చినా ఆయనకి పెళ్ళి కాలేదు. అందుచేత ఆయనకి పెళ్ళిళ్ళంటే మహా సరదా. అన్నిటికీ ముందు తిరిగేవాడు. ఒక పెళ్ళిలో ఏం చేశాడంటే, మధుపర్కం చాపు అడ్డంగా చింపవలసింది నిలువునా చింపుతూ, "అమ్మో, ఎంత వెడల్పో" అన్నాడు. చుట్టుపక్కల చిన్న పిల్లలు నవ్వుతున్నా, ఆయనకి తను నిలువునా చింపుతున్నట్టు తెలియలేదు. ఇలా రికామీగా వదిలి పెడితే ఇటువంటి అపక తవకలు ఎన్ని చేస్తాడో అని మా పెద్దలు ఆయన్ని బడి పంతులుగా నియమించారు, కుర్రాళ్ళ చదువులు ఎలా తగలడ్డా, కొత్త పంచెల చాపులికి ప్రమాదం రాకుండా ఉంటే చాలన్నట్టు.

ఎలిమెంటరీ స్కూళ్ళలో ముప్పాతిక మువ్వీసం ఈ తరహా వాళ్ళే బడి పంతుళ్ళుగా ఉండేవారు. బతకడానికి అర్హత లేని వాళ్ళకి బడి పంతులు ఉద్యోగం సులభంగా దొరికేది ఆ రోజుల్లో. కస్త మెడ మీద తల ఉన్న వాడెవడూ ఈ ఉద్యోగాలకు ఎగబడే వాడు కాదు.

అన్ని అర్హతలూ ఉన్నా, బతకడం కష్టమయిపోయిన ఈ రోజుల్లోకూడా చదువూ, చురుకుతనం ఉన్న వాళ్ళెవరూ పల్లెటూరి బడిపంతులు ఉద్యోగానికి రారు. అందుచేత అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితి అంతగా మారలేదు.

హైస్కూళ్ళలో కూడా చదువు అంతంత మాత్రంగానే ఉండేది ఆ రోజుల్లో. ముఖ్యంగా జిల్లా బోర్డు హైస్కూళ్ళలో. ప్రెసిడెంటు గారి ఆశ్రయం సంపాదిస్తే, ఎలాగో ఒకలాగ బడి పంతులు కావడానికి అవకాశం ఉండేది. ఇలా బడి పంతులయిన పెద్ద మనిషి జిల్లాబోర్డు మెంబరుగారి అబ్బాయికి లోకువ గాక తప్పదు. అతనితో పాటు అతని మిత్రులకుకూడా. ఒకసారి ప్రెసిడెంటుగారి మేనల్లుడికి లెక్కల్లో పాసు మార్కులు వెయ్యని ఒక మేస్టార్ని రాత్రివేళ మంచంతో మోసుకెళ్ళి అత్తిలి కాలవలో పారేశారు. 'ఎవరు?' అని పేరే అడగక్కర్లేదు. ఈ పరిస్థితుల్లో అయినవాడెవడన్నా హైస్కూలు బడి పంతులు ఉద్యోగానికి ఎందుకొస్తాడు? అందుచేత ఆ నాటికీ, ఈ నాటికీ రెండో రకం మనుషులే బడిపంతుళ్ళవుతున్నారు.

అయితే ఆ రోజుల్లో ఒక రకం బడి పంతులుండేవాడు— అరుదుగా. ఇప్పుడు మచ్చుకైనా కనపడడు.

మూడో ఫారంలో మాకో తెలుగు మేస్టారొచ్చేవారు. ఆయన మాత్రం 'బతకలేక బడిపంతులు' కాడు. సంస్కృతం, తెలుగు ఆయన కులవిద్య. మంచి గాత్రం. ఆరడుగుల స్ఫురద్రూపి. పద్యాలూ, శ్లోకాలూ ఆరభి రాగంలో అతి ఇంపుగా చదివే వాడాయన. బాగా లోకం తెలిసిన వాడు. జరుగుబాటు కోసం కాదు ఆయన బడిపంతులయింది. ఆసక్తి కొద్దీ. —నాకు ఆయన మొదటి రోజు పాఠం ఎలా మొదలు పెట్టాడో ఈ నాటికీ గుర్తు. పాఠ్యపుస్తకం తెరవకుండానే (ఆయన ఎప్పుడూ పుస్తకం చదువుతూ పాఠం చెప్పలేదు) పద్యం ఎత్తుకున్నాడు. "భారత భారతి శుభగభస్తి చయమ్ముల. . ." అని ఆపి, "ఆహా! యతి అంటే ఇలా పడాలిరా" అన్నాడు. "అంటే ఏమిటి, మేస్టారూ?" అని అడిగాం. పాఠం వదిలి పెట్టి ఆయన ఛందస్సును గురించి చెప్పడం మొదలుపెట్టాడు. నా కసలు ఛందస్సు పాఠ్యభాగం కాదు. అయితే ఆయనకి సిలబస్సు తోటీ, పరీక్షల తోటీ నిమిత్తం లేదు. మాకు తెలుగు నేర్పాలి. తెలుగులో అందచందాలు మా మనస్సుల్లోకి ఎక్కించాలి. తెలుగులో మాకు ఆసక్తి కలిగించాలి. అంతే. అభిజ్ఞాన శాకుంతలాన్ని ఎవరో వచనంలో కథగా వ్రాశారు. అది మాకు నాన్-డిటెయిల్డు. ఆయన శాకుంతలంలో శ్లోకాలు చదువుతూ కథ చెప్పడం మొదలెట్టారు. "మొదటి అంకంలో దుష్యంతుడున్నాడే- మన వెంకన్న పంతులు లాంటివాడు" అన్నారు. వెంకన్నపంతులు 18 ఏళ్ళకి బెంచీ మీద మూడో ఫారం అందు కున్నాడు. ఆడపిల్లల్ని ఏడిపించడంలో ఘటికుడు. దుష్యంతుడు వెంకన్న పంతులుగా మా మనస్సుల్లో నిలిచిపోయాడు. ఒకసారి నేను 'ట్రెయిన్' అన్న ఇంగ్లీషు పదాన్ని అనువదించమని ఇస్తే, "అయో మార్గగామి ధూమశకటం" అని వ్రాశాను. ఆయన "ఒరే, పది మందికీ తెలిసిన శుభ్రమైన తెలుగు మాట 'రైలు' ఉండగా ఈ తిలకాష్ఠ మహిష బంధకం ఎందుకురా?" అన్నాడు. ఎంత పాత కాలపు పండితుడయినా, అంత నవ్యుడు ఆయన. పైగా, ఎంత కొంటె కుర్రవాడి నయినా అతి సులభంగా లొంగదీయగల చాకచక్యం ఉండేది ఆయనకి. ఒకసారి వ్యాకరణ పాఠంలో వాగు, వాక వంటి వాటిలో అర సున్నలు ఉన్నాయని ఆయన చెప్తుంటే, ఒక కొంటె కుర్రాడు, "కోకలో అరసున్న ఉందాండీ?" అని అడిగాడు. క్లాసంతా గొల్లుమన్నారు. ఆయన మాత్రం తాపీగా, "అది తెలుసుకునే వయసు నీకు ఇంకా రాలేదు—కూర్చో. ఇప్పటినించీ అర సున్నల వేట మొదలు పెట్టావంటే పరీక్షల్లో నిండు సున్నలే నీ కొచ్చేది" అని చమత్కరించాడు. తెలుగు భాష మీద, పద్య శిల్పం మీద నాకు అపారమైన ఆసక్తి కలిగించింది ఆయనే.

మా పాలగుమ్మారి వెర్రాడి లాంటి మాస్టరే నాకు ఆ వయస్సులో తెలుగు నేర్పి ఉంటే, నాకు తెలుగు భాష మీద ఏవగింపు కలిగి ఉండేది—చిలకమర్తి వారి గణపతి శిష్యుల్లాగ.

ఏ విషయం బోధించే మాస్టరయినా సరే, ముందు అతని మీద పిల్లలకి గౌరవం కలక్కపోతే, అతడు చెప్పేది ఏదీ వాళ్ళ బుర్రల్లోకి ఎక్కదు. ముఖ్యంగా పసిపిల్లలకి విద్యాబోధ చెయ్యడానికి అర్హత ఉన్నవాళ్ళు ఏ కొద్ది మందో ఉంటారు. దానికి బోలెడంత తర్ఫీదు అవసరం. శిశువిద్య విషయమై నాగరిక దేశాల్లో ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారు. పరిశోధనలు జరుపుతున్నారు. ఎన్నో రకల ప్రయోగాలు జరుపుతున్నారు. మన దేశంలో మాత్రం ప్రాథమిక విద్యా విధానంలో ముఖ్యంగా పల్లెటూరి బళ్ళలో మార్పు ఏమీ రాలేదు. ఎలిమెంటరీ స్కూలు టీచర్లకు ముష్టి వేతనాలు ఇచ్చే తరీఫీదు ఇక్ష్వాకుల కాలం నాటివి. అందుచేత శక్తి, సామర్థ్యం ఉన్న వారెవరూ టీచర్లుగా రావడం లేదు. కాస్త ఉన్నవాళ్ళు పిల్లల్ని ఏ పబ్లిక్ స్కూలుకో పంపిస్తున్నారు. నూటికి తొంభైతొమ్మిది మంది పసిపిల్లలు చదువంటే వెగటు పుట్టే పరిస్థితుల్లో చదువుకుంటున్నారు.

ఇంక కుర్రవాళ్ళలో అరాజకత్వం పెరిగిపోతోందని మనం ఆందోళన పడి ఏం లాభం?

పాలగుమ్మి పద్మరాజు